# ఎలిజీలు

## – గొల్లపూడి మారుతీరావు



*కౌముది ప్రారంభసంచిక నుంచి క్రమం తప్పకుండా కనిపిస్తున్న పేరు ఆత్మీయ మిత్రులు గొల్లపూడి మారుతిరావు గారు. ఆయన వ్రాసిన ఎన్నో నవలలు, కథలు , వ్యాసాలు, కాలమ్స్ కౌముదిలో వచ్చాయి. ఆనవాయితీ తప్పకుండా వారు వ్రాసిన ఎలిజీలు వ్యాసాలను నెలకొకటి చొప్పున పునర్ముద్రిస్తున్నాము. గొల్లపూడి మారుతిరావుగారు భౌతికంగా మన మధ్యన లేకపోయినా ఆయన ఆశీస్సులు కౌముదిని సదా వెన్నంటే ఉంటాయి.*

*(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)*

### పేరడీ కవి



1961లో ఉద్యోగరీత్యా చిత్తూరులో ఉంటున్న రోజులు, మిత్రులమంతా కలిసి ఓ ఆదివారం రమణాశ్రమానికి ప్రయాణమయ్యాం. ఆశ్రమం, అరుణాచలేశ్వరుడికంటే చెలంగారిని చూడాలని ఆసక్తి. మమ్మల్ని చూడగానే మేమెవరిమో తెలియచెప్పేలోగానే చెలంగారి తియ్యని చిరునవ్వు ఆహ్వానించింది. ఆ ఇంటికి కాస్త ఎడంగా పెద్ద తోట, మధ్య రెండు గదుల్ని ప్రత్యేకంగా అతిథులకోసం తీసుకున్నారు. అక్కడ మా బస. మాలాగే కూర్మారావు అనే అభిమాని మమ్మల్నక్కడికి నడిపించుకుపోయాడు. పైజమా, లాల్చీ వేసుకుని గదిలో పచార్లు చేస్తున్న వ్యక్తి పేరు వినగానే పోలిక పెట్టాను. అభిరుచి సామ్యంతో వెంపటి రాధాకృష్ణ, నేనూ నాటకాల గొడవలో పడ్డాం. ఉన్నట్టుండి ఆ వాతావరణంలో మరొక వ్యక్తి కూడా ఉన్నట్టు నాకు హఠాత్తుగా అర్థమయింది. చటుక్కున రాధాకృష్ణ నన్ను గదిలోంచి పక్క వసారాలోకి తీసుకువచ్చి పద్మాసనం వేసుక్కూర్చుని జపం చేసుకుంటున్న ఒకాయన్ని చూపించాడు.

"వాడు మా రుక్కాయ్" అన్నాడు. నాకర్థంకాలేదు. జలసూత్రం రుక్మిణీనాథశాస్త్రి అని వివరించి చెప్పాక నాకు మరింకేమీ గుర్తురాలేదు. "ప్రతిభ"లో గేయం గుర్తుకొచ్చింది. 'జరుక్‌నాథ్ జాంబక్.." ఆ కుర్రతనపు చాపల్యంతో బయటికి అనేసిన గుర్తు. విని ఆయన కళ్ళిప్పారు. "వీళ్ళు చిత్తూరు నుంచి వచ్చారు. ఫలానా ఫలానా" అన్నాడు వెంపటి. "కాబోలు"

అని మళ్ళీ కళ్ళుమూసుకున్నాడాయన. అదే మా మొదటి పరిచయం. నుదుటన పెద్దబొట్టూ, రుద్రాక్షలూ ఒకదారీ తెన్నూ వెదుక్కోని జుత్తూ అదీ ఆయన స్వరూపం అప్పటికీ ఇప్పటికీ. దేవీ భక్తుడని తర్వాత చాలా సంవత్సరాల వరకూ తెలీదు నాకు.

అప్పటికే ఏడెనిమిదేళ్ళుగా రాస్తున్నా నా పేరెప్పుడూ ఆయన వినలేదనుకుంటాను. విన్నా గుర్తుంచుకోవలసినంతగా వినలేదేమో, ఆ తర్వాత మూడు రోజులు కలిసి ఉన్నాం. ఎన్నో విషయాలు మాట్లాడుకున్నాం. కానీ ఎన్నడూ మామధ్య 'సాహిత్యం' ప్రసక్తి రాలేదు. మా వంటి కుర్రాళ్ళనందర్నీ కూర్చోపెట్టి అల్లంత దూరంలో కనిపించే చెలంగారి గురించీ, వారిపై రమణాశ్రమం, భగవాన్ కలిగించిన ప్రభావాన్ని గురించీ కథలు కథలుగా చెప్పేవారు. ఆ వాతావరణంపై మా ఆసక్తి మరింత పెరిగి, నోళ్ళు విప్పుకుని వినేవాళ్ళం. ఒక విషయాన్ని గ్రహించటంలో చాలామంది కనిపెట్టలేని కొత్తదనాన్ని, చమత్కారాన్ని ఆకళించుకునే నేర్పు శాస్త్రిగారిది. నలుగురికీ సామాన్యంగా కనిపించే విషయాన్ని వింతగా చూసి దాంట్లోంచి కొత్త అర్థం తీస్తారు ఆయన. అందుకే ఆయన 'పేరడీ'లు రాయగలిగారేమో.

మొత్తం మీద చెలంగారి దగ్గర ఉన్న రోజులు చెలంగారి సాన్నిధ్యంలో, శాస్త్రిగారి సాహచర్యంలో మాలాంటి యువకులకు అద్భుతమయిన కలలాగ గడిచిపోయాయి. భోజనానికి బసవరాజుగారి కేకో, చెలంగారి పిలుపో వినిపించేవరకూ అలా కబుర్లు చెప్పేవారు. తీరా వెళ్ళాక అక్కడ వడ్డనకి ఆలస్యమయితే నోరు విప్పేవారు కాదు. ఓ చెట్టు నీడకిపోయి కూర్చుని పుస్తకం చదువుకునేవారు శాస్త్రిగారు. నాకు బాగా గుర్తు. ఆ మూడు రోజులూ చెలంగారి "మహాస్థాన్" చదువుతున్నారు. మూడోరోజు మధ్యాహ్నానికి పుస్తకం మూసి "అద్భుతమయిన పుస్తకం" అని ఒక్కసారి వొళ్ళు విరుచుకుని చాపమీద వత్తిగిల్లారు. అంతా కలిసి ఆశ్రమం, భగవాన్ సమాధి, ప్రార్థనా మందిరం అన్నీ తిరిగాం. అరుణాచలం ఎక్కాం. కావ్యకంఠ గణపతి శాస్త్రి, భగవాన్ కూర్చుని "ఉమాసహస్రం" చెప్పిన గృహం దగ్గర అద్భుతంగా ఆ గ్రంథంలోని శ్లోకాలు ఉదహరించి చెప్పారు.

పరిచయమయి ఇరవైనాలుగు గంటలు జరక్కముందే మేమంతా శాస్త్రిగారి అభిమానులం అయిపోయాం. ఓ రాత్రి భోజనాలయ్యాక అంతా ఊళ్ళోకి నడిచివస్తూ రమణాశ్రమానికి అల్లంత దూరంలో ఓ ఎలక్ట్రిసిటీ స్థంభం అరుగు మీద కూర్చుని అర్ధరాత్రి వరకూ కబుర్లు చెప్పుకున్నాం. మా అందర్లోకి మరీ చిన్నవాడు కూర్మారావు. బొబ్బిలినుంచి చెలంగారిని చూడాలని వచ్చాడు. సిసింద్రీలాగా ఇంటినుంచి విడిదికి తిరుగుతూ నలుగురికి తెగ సేవలు చేసేవాడు. అతను నాలుగయిదు గేయాలు రాశాడనీ, రాయాలనే ఉత్సాహం ఉన్నదనీ అప్పుడే అర్థమయింది. ఏదో సహాయం చేసిపెడితే రుక్మిణీనాథ శాస్త్రిగారు అతని భుజం మీద చెయ్యివేసి "ఇతణ్ణి కవిని చెయ్యాలయ్యా - మంచి కవిని చెయ్యాలి" అన్నారు.

"అంటే ఏం చెయ్యాలని మీ ఉద్దేశం?" అన్నాను.

"ఏమీలేదు, నిష్ఠగా భారతం పద్దెనిమిది పర్వాలూ చదివిస్తే సరి" అన్నారు.

ఆ తర్వాత నిజంగా ఆ తర్వాతనే నేను భారతం చదవడానికి ఉపక్రమించాను. ఆయన "పేరడీ" ధోరణి ప్రభావం అప్పటికే మా మీద కనిపించింది. మేమంతా కుర్రవాళ్ళం కావడం చేత మా మీద మరింత చనువుగా చమత్కారాలు అనేసేవారు.

కూర్మారావ్ కనిపించడం చాలు "కవి కూర్మం, కూర్మ కవి, కోడి కూర్మా కవి" ఇలా సాగేది. ఆ రోజుల్లోనే నాకో నామకరణం చేశారు శాస్త్రిగారు. మారుతిపూడి గొల్లారావు. ఆ తర్వాత ఎన్ని సంవత్సరాలకు మేము కలిసినా, నాకు ఉత్తరాలు రాసినా అలాగే పిలిచేవారు. చివరిరోజు వరకూ ఆయన అలా పిలుస్తూనే ఉన్నారు.

మరుసటి సంవత్సరం ఎక్కడ బయలుదేరిందో (చెలంగారి ఆశ్రమంలోనే ప్రారంభమయిందనుకుంటాను) 1962 ఫిబ్రవరి ఎనిమిదో తేదీనాటికి ప్రళయం తప్పదని సముద్రతీర ప్రాంతాలు, మరేవో కొన్ని ప్రాంతాలూ జలమయం అవుతాయని వదంతి బయలుదేరింది. మా అందరికీ ఇది వింతగానే కనిపించింది. చెలంగారినుంచి మా అందరికీ ఒకటి రెండు ఉత్తరాలు కూడా వచ్చినట్టు గుర్తు. అదిగో ఆ సందర్భంలో కుటుంబంతోపాటు చిత్తూరుకు తరలి వచ్చారు రుక్మిణీనాథ శాస్త్రిగారు. దాదాపు పదిహేను, ఇరవైరోజులున్నారు. అవి చాలా మంచి రోజులు. నేనప్పుడు "ఆంధ్రప్రభ"లో ఉండేవాడిని. మాతోపాటు ఆయన రోజూ ప్రభ ఆఫీసుకు వచ్చేవారు. సరదాగా కబుర్లతో, చర్చలతో, కథలలో, ప్రసంగాలతో రోజులు గడిచిపోయేవి. శాస్త్రిగారుంటే విషయాలకి వెదుక్కోవలసిన పనిలేదు. మా మాటల మధ్యనుంచి ఎన్నో అంశాలు దొర్లిపోయేవి. ఆఫీసు నుంచి ఇంటికి నా సైకిలు నడిపించుకుంటూ నడిస్తే నా చేతిలోంచి సైకిలు లాక్కుని నిర్జనంగా ఉండే ఆ రోడ్డు మీద ఆ వయస్సులో సరదాగా శాస్త్రిగారు సైకిలు తొక్కడం నాకింకా గుర్తే.

నాకు కొత్తగా పెళ్ళయిన రోజులవి. మా ఆవిడ పేరు శివకామసుందరి. ఎప్పుడు ఇంటికి వచ్చినా ఇంట్లో ఎన్ని కుర్చీలున్నా సరాసరి వంటింట్లోకి పోయి గోడకి చేరబడి గొంతికిలా కూర్చుని "అమ్మా తల్లీ, నాక్కొంచెం కాఫీ చుక్క ఇయ్యి" అనేవారు.

నేను కుర్చీవెయ్యబోతే "నాకు గౌరవాలెందుకయ్యా. నువ్వు నాకు దూరం. కానీ ఆవిడది మా అమ్మగారి పేరు. నాకు ఆవిడే బంధువు" అని ఆప్యాయంగా కబుర్లు చెప్పి వెళ్ళేవారు.

ఇరవైరోజులు గడిచాక మళ్ళీ కుటుంబంతో మద్రాసో, బందరో వెళ్ళినట్లు జ్ఞాపకం. చాలా నెలల తర్వాత మరొక్కసారి మద్రాసులో ఆయన ఇంట్లో కలిశాను.

1965లో ఉద్యోగం ఆకాశవాణికి మారి ఉనికి హైదరాబాద్ అయినప్పుడు ఒక సాహితీ సంస్థ ద్వారా ఆంధ్ర నాటకరంగ సమగ్ర చరిత్రను ఆవిష్కరించే వ్యాసావళిని ప్రచురించడానికి ప్రయత్నం చేశాం. ఆ ప్రయత్నంలో దాదాపు 150 మంది రచయితలకు ఉత్తరాలు రాశాం. "బందరు నాటక రంగం" పై వ్యాసం ఇవ్వవలసిందని ప్రత్యేకంగా మిత్రులు మల్లాది నరసింహ శాస్త్రిగారూ, నేనూ రుక్మిణీనాథ శాస్త్రిగారికి రాస్తూ వచ్చాం. ఆయన అప్పటికి విజయవాడ ఆకాశవాణికి వచ్చేశారు. కానీ అదేం ఖర్మమో మా ఒక్క ఉత్తరానికి ఆయన దగ్గర్నుంచి సమాధానం రాలేదు. గ్రంథ ముద్రణ ప్రారంభించాక కూడా ఆయన వ్యాసం వచ్చే సూచన కనిపించలేదు. నేను ఉత్తరాలమీద ఉత్తరాలు గుప్పించేవాణ్ణి. ఒకసారి "మల్లాది సూరి శాస్త్రిగారి పుస్తకాలు ఒకటి రెండు చూడాలి. అవి బందరులో ఉండిపోయాయి. ఈ మాటు తెచ్చుకుని పూర్తి చేస్తాను" అన్నారట. నరసింహ శాస్త్రిగారు తిరిగి వస్తూ వాటిని తెచ్చి ఇచ్చారు. అయినా జాప్యం జరుగుతూనే వచ్చింది. ఫారలమీద ఫారాలు ముద్రణ అయిపోతున్నాయి. అప్పుడే రెండు వందల పేజీల గ్రంథం అయిపోయింది. ఘాటుగా పెద్ద ఉత్తరం రాశాను. వెంటనే సమాధానం వచ్చింది.

''మారుతిపూడి గొల్లారావు గారికి, నాయనా! నీ ఉత్తరాలు అందుతున్నాయ్. శరీరం తుక్కుతుక్కు అయి, మంచాన పడినట్లు అయి, మీకు వ్యాసం పంపడం ఆలస్యం చేశాను. మీ ఇది నాకు తెలుసు. మన్నించండి. ఇవాళ సోమవారం, గురువారంనాడు మీకు పోస్టు చేస్తున్నాను.''

ఆ గురువారం రానే వచ్చింది. కానీ వ్యాసం మాత్రం రాలేదు. మళ్ళీ ఉత్తరాలు సంధించాను. ఆఖరికి చేరింది. మణిపూసలాంటి వ్యాసం పంపారు. డాక్టరేటుకి పరిశోధన చేసి వ్రాసినట్టు అనిపించింది. అంత గొప్ప వ్యాసం. తూచి తూచి వ్రాసి ఇచ్చారు. దాన్ని చదివాక అర్థమయింది. అంత ఆలస్యానికి కారణం. ప్రతీ అంశం, చదివి, ఆకళించుకుని, తనని తాను ఒప్పించుకుని కాగితం మీద పెట్టారు శాస్త్రిగారు, చాలా హృద్యంగా, అదిన్నీ గర్వంతోకాదు. దానితో ఓ ఉత్తరం రాస్తూ ''వ్రాత తప్పులూ, వాక్యదోషాలూ సవరించగోరుతున్నాను'' అని వ్రాశారు. నాకు విజయవాడ బదిలీ అయి వచ్చాక శాస్త్రిగారితో కలిసి పనిచేసే అవకాశము వచ్చింది. అప్పటికీ ఆయనలో వృద్ధాప్యం కనిపించింది. అంతకుముందే జబ్బుపడి లేచినట్టున్నారు. కానీ మాటలో, ప్రసంగించడంలో ఇంకా పాత ఆకర్షణని, తియ్యదనాన్ని పోగొట్టుకోలేదు. నేనున్నప్పుడు ఎప్పుడు మా గదివేపు వచ్చినా, ఆయన నోటివెంట కొత్త పద్యమో, కొత్త చమత్కారమో విననిదే వదిలేవాణ్ణికాదు. ఎంత దూరంలో ఉన్నా పలకరించి ''నమస్కారమంటే'' చేతులు జోడించి ''పామరుణ్ణి పరమబీదవాణ్ణి'' అనడం ఆయన చమత్కారం.

మధ్యాహ్నం వేళల్లో ''టీ'' కావాలని నా టేబులు దగ్గర కూర్చుంటే కోరి వాల్మీకి రామాయణంలో రెండు శ్లోకాలు చదివించుకుని దానిలో తియ్యదనాన్ని గాంభీర్యాన్ని పూర్తిగా అనుభవించి మరీ ''టీ'' ఇచ్చి పంపేవాణ్ణి. అది మా ఇద్దరి మధ్య షరతు. ఆ తర్వాత ''టీ కావాలోయ్'' అని ''ఓహో నీకు శ్లోకాలు చదవాలి కదూ'' అని సర్దుకుని కూర్చునేవారు శాస్త్రిగారు. అవి చాలా అపురూపంగా గడిచిన క్షణాలు.

ఆయన మనసు కుదిరితే చాలా గొప్ప ప్రసంగాలు రేడియోలో చేసిన సందర్భాలున్నాయి. కుదరకపోతే ఇష్టాగోష్ఠిలాగా ఆ ప్రసంగము జారిపోయిన సందర్భాలున్నాయి. ''త్యాగరాజు ఉపమసంపద'' వంటి ప్రసంగాలు ఎన్నో చాలా మంది శ్రోతలు మరచిపోలేనివి ఉన్నాయి. ద్రౌపది కథ ''పంచదార'' అని వ్రాశారు.

ఆ మధ్య తరచు తిరుపతి వెంకటకవుల గ్రంథాలు చేతబుచ్చుకు కనిపిస్తూండేవారు. ''నానారాజ సందర్శనం'' చాలాసార్లు చదువుతూ కనిపించేవారు. తీరిక దొరికినప్పుడల్లా ఆయన్ని కదిపి విడిచి పెడితే ఎన్నో చమత్కారాలు, ఎన్నో కథలూ. గుంటూరులో వేలూరి శివరామశాస్త్రిగారి శతావధానం నుంచి పిఠాపురంలో వెంకటశాస్త్రిగారి నిత్యజీవితం వరకూ చెప్పేవారు. అప్పుడు చెప్పారు తిరుపతి వెంకటకవుల గురించి ఆయన ఓ గ్రంథాన్ని వ్రాయాలనుకుంటున్నట్టూ, కానీ అది వ్రాయకుండానే కన్నుమూశారు. ఈ ప్రసక్తి నేను తెస్తే అట్లాంటివి మరెన్నో వ్రాయవలసినవి ఉండిపోయాయని మిత్రులన్నారు. శాస్త్రిగారు తెలుసుకున్నదంతా మనకు చెప్పడానికి జీవితం కురచ అయింది. వ్యవధి చాలలేదు. ఆ లోపం మరింక భర్తీకాదు.ఆ మధ్య కొడవటిగంటి కుటుంబరావుగారు విజయవాడ వచ్చినప్పుడు కొందరు మిత్రులం కలిశాం. మాటల ప్రసక్తిలో మాతో వచ్చిన ఒకాయన అన్నాడు. ''మీకు సాహితీ ప్రపంచంలో ఇంత విశాలమైన అనుభవం ఉండి ఎన్నో రకాలయిన ధోరణుల్ని, వ్యక్తుల్ని, రచనా సంవిధానాల్ని చూశారు. మరి ఈ సాహితీ రంగంలో ప్రముఖుల 'పెన్ పోర్ట్రెయిట్స్'

రాయకూడదా?" అని. కుటుంబరావుగారు ఒక్క క్షణం ఆలోచించి, "ఆ దృష్టిలేదు నాకు. దానికి తగినవారు రుక్మిణీనాథ శాస్త్రిగారు. దానికి కావలసిన దృష్టి, ఆర్ద్రత, విచక్షణ కలవారు ఆయనే" అన్నారు.

ఆ మాట శాస్త్రిగారితో నేనన్నప్పుడు ఆయన నవ్వి ఊరుకున్నారు. ఊరుకున్నారే కానీ మనసులో ఆ ఆలోచన పనిచెయ్యదా అనుకునేవాణ్ణి. మృత్యువు ఆయనకి మరికాస్త వ్యవధి ఇస్తే కాలం మరచిపోయిన కవుల, రచయితల "రూప చిత్రణల్ని" ఆయన వ్రాయగలిగేవారేమో!

ఓ రోజు నా టేబుల్ ముందు కూచుని సరిగ్గా ముప్పయ్యారేళ్ళనాడు భార్యతో సహా ఆంధ్రపత్రిక ఉద్యోగానికి ఎలా మద్రాసు చేరిందీ వివరంగా చెప్పారు. అంతా చెప్పి అలా వచ్చిన తాను మరో సంవత్సరంలో దాదాపు అలాగే బందరు తిరిగి పోవాలని అన్నారు. అలా అంటున్నప్పుడు ముఖంలో నవ్వు కనిపించినా, మనస్సులో రుద్దత ఉన్నదని నా అనుమానం. సాహితి సంపత్తిని, కీర్తిని, స్నేహ ప్రపంచాన్ని పెంచుకుని కేవలం మూడు దశాబ్దాల కిందటి స్థితిలోనే ఉద్యోగ విరమణ జరపాలన్న ఆలోచన అతని మనసులో ఏ మూలనో బాధపెడుతున్నదని నా అనుమానం. "మరో సంవత్సరం" అని మాతో పదే పదే నవ్వుతూ అనడంలో చిన్న "నొప్పి" ధ్వనించడం నేను కనిపెట్టాను. అయినా ఉత్సాహాన్నీ, ఆసక్తినీ ఎప్పుడూ మరిచిపోలేదు శాస్త్రిగారు.

రాచకొండ నరసింహమూర్తిగారు ఆ మధ్య బాగా గెడ్డం పెంచినప్పుడు - 20 పద్యాలు చెప్పారు శాస్త్రిగారు ఎన్నో దశాబ్దాల కిందట ఆయన "పేరడీల్లో" కనిపించిన విసురూ, వేగమూ, చనువూ మరింత పదునుగా పద్యాల్లో కనిపించాయి. చాలా ముచ్చటగా దొరికినప్పుడల్లా ఒక్కపద్యమయినా చదివించకుండా వదిలేవాణ్ణికాదు.

ఈ మధ్య ఒకసారి "శాస్త్రిగారూ మరి నా ముక్కు మీద పద్యం చెప్పరూ?" అన్నాను.

"నువ్వీ ఉద్యోగంలో పాతికేళ్ళుంటావు. నేను ఖచ్చితంగా సంవత్సరంపైన ఉంటాను. వెళ్ళిపోయేలోగా నీ గురించి పద్యాలే చెప్పలేనా?" అన్నారు నవ్వుతూ.

కానీ చెప్పటం జరగదని అప్పట్లో మాఇద్దరికీ తోచలేదు. ఆఖరికి నాకు పద్యాలు బాకీ పడి చెప్పకుండా వెళ్ళిపోయారు శాస్త్రిగారు.

ఆ చమత్కారం, ఆ పట్టువిడుపులూ, అంత విద్వత్తూ, నేర్పూ గడుసుతనంతో "పేరడీలు" చెప్పే నిపుణత ఆంధ్రదేశానికి కొరతగా అలాగే ఉండిపోయింది. ఆయన నా గురించి చెప్పని నా ముక్కుమీద పద్యం నాకు Unheard melodyగా మిగిలిపోయింది.

*(వచ్చే నెలలో మరో ఎలిజీ)*

Post your comments